బాధిత కుటుంబానికి పరామర్శ

నివాళులర్పిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 19: మండలంలోని అహ్మదీపూర్‌కు చెందిన కేబుల్ ఆపరేటర్ ఉత్తనూరి లింగం గుండెపోటులో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి గ్రామానికి చేరుకొని అతడి కుటుంబీకులను పరామర్శించి మనోధైర్యం నింపి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రాజిరెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి


కొమురవెల్లిలో పట్టభద్రున్ని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, మే 19: వరంగల్-నల్లగొండ- ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆదివారం బీఆర్ఎస్ కొమురవెల్లి మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్, డీఏ పెంచిన విషయాన్ని గుర్తు చేయడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరికీ కూడా ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఇచ్చిన ఉద్యోగాలను తమ గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గతంలో నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో సైతం అనేక ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్, డీఏలు ఇవ్వడంతో పాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నోటిఫికేషన్ వేస్తామని ఉద్యోగ, నిరుద్యోగులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓట్లతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు ఏర్పుల మహేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తలారి కీషన్, గొల్లపల్లి కిష్టయ్య(జీకే), అన్నెబోయిన రవీందర్, కొండ శ్రీధర్, స్వాములపల్లి కనకచారి, బొడిగం వంశీ, గొల్లపల్లి నాగరాజు, కొడిసెల రాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'నగర సంకీర్తన'

గాగిళ్లాపూర్ నగర సంకీర్తనలో భక్తులు

మద్దూరు(ధూళిమిట్ట), మే19: మర్కూక్ పాండురంగ ఆశ్రమం ఆధ్వర్యంలో చేపట్టిన 'శతకోటి హరేరామనామ జపయజ్ఞం'లో భాగంగా మద్దూరుతో పాటు మండలంలోని గాగిళ్లాపూర్, నర్సాయపల్లి, ధూళిమిట్ట,బైరాన్‌పల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ఏకాదశిని పురస్కరించుకొని నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్‌మాన్ స్వాములు, భక్తులు హరేరామ సంకీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు.

ధూళిమిట్టలో పోచమ్మతల్లికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పోచమ్మకు బోనాలు

మద్దూరు(ధూళిమిట్ట), మే19: ధూళిమిట్టలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ పండుగ ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉదయం డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని పోచమ్మ ఆలయం వరకు సామూహికంగా వెళ్లి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. గౌడ కులస్తులు పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.


గంగరేగు చెట్టు అవరణలో భక్తుల సందడి

కొమురవెల్లిలో భక్తుల రద్దీ

- మల్లన్నను దర్శించుకున్న 20వేల మంది భక్తులు

పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చేర్యాల, మే 19: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారిని సుమారు 20 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మరికొందరు భక్తులు స్వామివారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు.మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


గదేవ్‌పూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగదేవ్‌పూర్, మే 19: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం ఐకేపీ కేంద్రాల్లో తడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారని విమర్శించారు. రైతులకు అండగా ఉంటామని, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారులు స్పందించి కేంద్రాల్లో త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, పార్టీ అధ్యక్షులు నాగరాజు, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ కనకయ్య, నాయకుడు మహేశ్ పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో ప్రయోజనాలెన్నో..

జీలుగు, జనుము,పిల్లిపెసర సాగుతో భూమి సారవంతం

- సేంద్రియ పదార్థాలతో సూక్ష్మజీవులు వృద్ధి
- రసాయన ఎరువులతో భూసారం కోల్పోయే ప్రమాదం
- పచ్చిరొట్ట ఎరువులతో భూమికి సత్తువ, అధిక దిగుబడులు
- రైతులకు అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు: ఏడీఏ మహేశ్

జనుము పైరును రోటోవేటర్‌తో కలియదున్నుతున్న దృశ్యం

ఏపుగా పెరిగిన జీలుగ పైరు

హుస్నాబాద్, మే 19: రసాయనాలు, ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల భూమిలోని సారం పూర్తిగా తగ్గిపోయి పంటల దిగుబడులు పడిపోతున్నాయి. రసాయనాల వల్ల రైతులు పండించిన పంటలోనూ నాణ్యత లేకపోవడం, తద్వారా ఇవి తిన్న ప్రజలు అనారోగ్యం బారిన పడటం తరచూ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తలు సేంద్రియ, సహజసిద్ధమైన పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించి పంటలు పండించాలని సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువుల్లో ముఖ్యంగా వర్మీ కంపోస్టు, పశువుల పేడను వినియోగిస్తారు. వీటి తయారీకి అధిక ఖర్చయ్యే అవకాశం ఉన్నందున పచ్చిరొట్ట ఎరువులు అతితక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. వానకాలం తొలకరి జల్లులు కురవగానే పచ్చిరొట్ట పైర్లను సాగు చేసినట్లైతే వానకాలం పంట సాగు చేసుకునేటప్పటికీ ఎరువులు సిద్ధంగా ఉంటాయి. పచ్చిరొట్ట పైర్లలో 16రకాలు ఉంటాయి. ఇందులో జీలుగ, అవిశ, జనుము, వెంపల్లి, అలసంద, పిల్లిపెసర, పెసర, మినుము, గోడుచిక్కుడు, అజోల్ల, కానుగ, వేప, గ్లైసిడియా, జిల్లేడు, నేలతంగేడు, కొండ మిరుప తదితర రకాలు ఉన్నాయి. వరితో పాటు ఏ పంట సాగు చేసినా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు అవసరం. ఇవి పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా పుష్కలంగా సమకూర్చుకునే అవకాశం ఉంది.

జీలుగ సాగు విధానం....

జీలుగ పంటను చౌడు, వరి పండించే భూముల్లో సాగు చేసినట్లైతే మంచి ఫలితాలు ఉంటాయి. ఎకరానికి 20కిలోల విత్తనాలు అవసరమవుతాయి. మొక్కలు పెరిగి పూతదశకు వచ్చే సరికి 6 నుంచి 8టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. వీటిని అదేపొలంలో కలియదున్ని మురగపెట్టినట్లైతే 30 నుంచి 32కిలోల యూరియా లభిస్తుంది. ఈ పంటను సాగుచేయడం వల్ల పొలంలో వేయాల్సిన యూరియా కన్నా 30 నుంచి 32కిలోలు తక్కువగా వేసినా సరిపోతుంది. వీటిద్వారా 3.5శాతం నత్రజని, 0.6శాతం భాస్వరం, 1.2శాతం పొటాష్ లభిస్తుంది.

జనుము సాగు విధానం

జనుము సాగు చేసేందుకు ఒక ఎకరానికి 9నుంచి 14కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. దీని ద్వారా ఎకరానికి 5 నుంచి 6టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. వీటిని పొలంలోనే కలియదున్నితే 24కేజీల యూరియా లభిస్తుంది. ఇందులోనూ 2.3శాతం నత్రజని, 0.5శాతం భాస్వరం, 1.8శాతం పొటాష్ ఉంటాయి.

పెసర, మినుము...

పెసర, మినుము పచ్చిరొట్టతో ఎకరానికి 15నుంచి 20కిలోల యూరియా వస్తుంది. వరిసాగు చేసే పొలాల్లో వీటిని వేసుకోవడం వల్ల అధిక లాభం ఉంటుంది. భారీగా నత్రజని కూడా లభిస్తుంది. పూతదశకు రాగానే పొలంలోనే దున్ని మురగపెడితే పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది. సహజసిద్ధ ఎరువు కావడంతో వరిధాన్యం నాణ్యతగా ఉండటంతోపాటు ఈ పంట ద్వారా వచ్చిన బియ్యం తిన్న ప్రజలు ఎంతో ఆరోగ్యంగా ఉంటారు.

అవిశ పంట సాగు...

అవిశ పంటకు ఎకరానికి 16కేజీల విత్తనాలు అవసరమవుతాయి. దీని ద్వారా సుమారు 40 కేజీల నత్రజని ఉత్పత్తి కావడం విశేషం. సెస్బానియం పచ్చిరొట్ట సాగు చేయాలనుకుంటే ఎకరానికి 16కేజీల విత్తనాలు వేసుకోవాలి. ఎకరం పొలానికి 70 కేజీల దాకా నత్రజని లభిస్తుంది.

అలసంద, పిల్లి పెసర పంట...

అలసంద సాగుకు ఎకరానికి 15కేజీల విత్తనాలు అవసరం ఉంటాయి. ఈ మొక్కలను పొలంలో కలియదున్నితే 60 కేజీల వరకు నత్రజని ఉత్పత్తి అవుతుంది. పిల్లిపెసర ఎకరానికి కేవలం 6కేజీల విత్తనాలు సరిపోతాయి.

జనుము పంట

దీని ద్వారా ఏకంగా 40కేజీల నత్రజనిని పొలంలో ఉత్పత్తి చేసుకోవచ్చు.

పచ్చిరొట్ట ఎరువులను రెండు రకాలుగా తయారు చేసుకోవచ్చు...

- పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, పెసర, అలసంద వంటి పైర్ల విత్తనాలు దుక్కిలో వెదజల్లాలి. అవి పెరిగిన తర్వాత 50శాతం పూత దశలో పొలంలో కలియదున్ని కుళ్లిన తర్వాత పంటను వేసుకోవాలి.
- వేప, నేలతంగేడు, కానుగ, గ్లైరిసిడిరియాకు సంబంధించిన మొక్కల ఆకులు, కొమ్మలను సేకరించాలి. వీటిని పొలంలో వేసి కలియదున్ని మురగనివ్వాలి. ఆ తర్వాత ప్రధాన పంటను వేసుకోవాలి.

సాగు విధానం...

వేసవిలో పంటలు కోయగానే దుక్కి దున్నుకోవాలి. తొలకరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి. నీటి వసతి ఉంటే వేసవిలోనే సాగు చేయడం లాభదాయకం. పసుపు, కంది, చెరుకు వంటి పంటల మధ్య కూడా పచ్చిరొట్ట పైర్లను పూతదశంలో కలియదున్నుకోవాలి. పచ్చిరొట్ట పైర్లను సాగు చేసేందుకు ఎక్కువ విత్తనాలు చల్లుకోవాలి. ఎందుకంటే తక్కువ విత్తనాలు చల్లితే మొక్కలు పెరడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది.

అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

జీలుగ, జనుము విత్తనాలను ముందస్తుగానే రైతులకు అందుబాటులో ఉంచాం. ఇప్పటికే పలు స్టోర్లలో నిల్వ ఉంచాం. జీలుగ విత్తనాలకు కిలో ధర రూ. 93 ఉండగా ఇందులో రూ. 55.80 సబ్సిడీ పోను రైతు రూ. 37.20 చెల్లించాల్సి ఉంటుంది. 30కి లోల బస్తా చొప్పున ప్రస్తుతం విక్రయానికి ఉంచాం. జనుము విత్తనాలు కిలో ధర రూ. 90.50 ఉండగా ఇందులో ప్రభుత్వం రూ. 54.30 సబ్సిడీ ఇస్తుంది. రైతు చెల్లించే ధర రూ. 36.20 మాత్రమే. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకొని పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందాలి. పూర్తి వివరాలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

– పి.మహేశ్, అసిస్టెండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, హుస్నాబాద్

పచ్చిరొట్ట ఎరువుల ఉపయోగాలు....

- పచ్చిరొట్ట పైర్లను పొలంలోనే కలియదున్నడం వల్ల సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందుతాయి. భూసారం పెరుగుతుంది.
- భూమిని గుల్లపరిచి నీటి నిల్వ సామర్థ్యం అధికం అవుతుంది.
- భూమిలో లభ్యంకాని రూపంలో ఉండే అనేక పోషకాలను లభ్యరూపంలోకి మారుస్తాయి.
- పచ్చిరొట్ట పైర్లు పువ్వు జాతి మొక్కలకు చెందినవి. కాబట్టి గాలిలోని నత్రజనిని పీల్చుకొని స్థిరీకరిస్తాయి.
- రైజోబియం అనే బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని మొక్క వేర్ల లోని బొడిపెలలో నిల్వచేసి ఎకరానికి 25నుంచి 50కేజీల నత్రజనిని అందిస్తాయి.
- చౌడు భూముల పునరుద్ధరణకు జీలుగ, సీమ జీలుగ మొక్కలు ఎంతో ఉపయోగపడుతాయి.
- పచ్చిరొట్టతో భాస్వరం, గంధకం లభ్యత చాలా పెరుగుతుంది.
- రసాయన ఎరువులు ఉపయోగించడానికి బదులుగా పచ్చిరొట్ట సాగు చేస్తే ఎన్నో విధాలుగా ఉపయోగకరంగా ఉంటుంది.
- పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుంది.
- జింక్, మాంగనీసు, ఇనుము, క్యాల్షియం లాంటి సూక్ష్మధాతువులను పంటకు చేర్చుతాయి.
- నేల సహజ మిత్రులైన వానపాముల వృద్ధికి దోహదపడుతాయి.
- తుంగ, గరిక లాంటి గడ్డి మొక్కల పెరుగుదలను పచ్చిరొట్ట ఎరువులు అడ్డుకుంటాయి.
- నేలలో కరగని మూలకాలనూ కరిగించి పంటకు అనుకూలంగా మార్చుతాయి.
- సహజ సిద్ధంగా ఎరువులు లభిస్తుండటంతో పంటల్లో రసాయనాల శాతం కూడా తగ్గుతుంది. దీంతో వినియోగదారులకు స్వచ్ఛమైన ధాన్యం, మంచి ఆరోగ్యం లభిస్తుంది.

చేర్యాలలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లిలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

చేర్యాల, మే 19 : స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారతదేశం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పట్టణంలోని సీపీఎం కార్యాలయంతో పాటు ముస్త్యాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు సుందరయ్య పేదల కోసం దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి విముక్తి కోసం చేసిన ఉద్యమాలు మరువలేనివన్నారు.కార్యక్రమంలో మండల,పట్టణ కార్యదర్శులు కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు బండకింది అరుణ్‌కుమార్, నాయకులు నర్సిరెడ్డి, రాళ్లబండి భాస్కర్, పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం, లావణ్య, లక్ష్మి, అశోక్, రాములు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి, మే 19 : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం కొమురవెల్లి మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడటంతో పాటు సుందరయ్య ఆశయ సాధనకు కృషి చెద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, అత్తిని శారద, సార్ల యాదయ్య, ఆరుట్ల రవీందర్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, మే 19: సీపీఎం దిగ్గజం, స్వాతంత్ర్య సమరయోధుడు పార్లమెంటరీ మొదటి ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని గజ్వేల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందనబోయిన ఎల్లయ్య, నాయకులు రవి, బండ్ల స్వామి, కనకయ్య, వెంకటేశ్, , వెంకట్‌చారి, ఐలయ్య, నర్సింహులు, రాజు, మల్లేశ్, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అక్బర్‌పేట-భూంపల్లిలో..

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మే 19: అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాల స్వామి, మిరుదొడ్డి మండల ప్రధాన కార్యదర్శి మద్దెల ఆంజనేయులు పాల్గొన్నారు.

గజ్వేల్: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


మిరుదొడ్డి: అక్బర్‌పేట-భూంపల్లిలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు


బెజ్జంకి: బేగంపేట ఉన్నత పాఠశాల సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అ'పూర్వ' సమ్మేళనం

బెజ్జంకి, మే 19: మండలంలోని బేగంపేట ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చాట్లపల్లి ఉన్నత పాఠశాలలో..

జగదేవ్‌పూర్ ,మే 19: మండలంలోని చాట్లపల్లి ఉన్నత పాఠశాలలో 2007-08 బ్యాచ్ టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను ఒకరికొకరు నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాయకులు హనుమంతా రెడ్డి, నరేశ్, రాజు,వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నర్సింహులు, లవేందర్‌రెడ్డి, భిక్షపతి, దర్గయ్య, మల్లేశం, విద్యార్థులు కవిత, అరుంధతి, పర్విన్, కనకలక్ష్మి, భాస్కర్, అంజి, శ్రీను మల్లారెడ్డి, ప్రభాకర్, చంద్రశేఖర్, నాగరాజు, అశోక్, హరిబాబు, రాజిరెడ్డి, పర్వతాలు పాల్గొన్నారు.


చాట్లపల్లి ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును అందచేస్తున్న ప్రతాప్‌రెడ్డి

మర్కూక్, మే 19: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మర్కూక్ మండలంలోని గంగాపూర గ్రామానికి చెందిన జుగ్రాజ్ విశాల్ కొన్నిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉన్నందున ఆదివారం ప్రమాద బీమా నుంచి మంజూరైన రూ. 2లక్షల చెక్కును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జడ్పీటీసీ మంగమ్మారామచంద్రం, వైస్ఎంపీపీ బాల్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌తో కలిసి మృతుడి కుటుంబానికి అందజేశారు. మేకల కనకయ్య, సంతోష్‌రెడ్డి, గడ్డం ప్రసాద్, భాస్కర్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్లెపల్లిలో గ్రామ దేవతలకు బోనాలు

కల్లెపల్లిలో రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు

బెజ్జంకి, మే 19: మండలంలోని కల్లెపల్లిలో రేణుకా ఎల్లమ్మ జాతరలో భాగంగా బోనాలు తయారుచేయగా, గూడెంలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి దేవాలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు, గ్రామస్తులు, మాజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

21న సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

హుస్నాబాద్‌టౌన్, మే 19: మండల కేంద్రమైన హుస్నాబాద్ సిద్ధేశ్వరస్వామి ఆలయ గుట్టపై నిర్మించిన సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం ఈనెల 21వతేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి అధ్యక్షుడు కొత్తపల్లి అశోక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్ష్మీహోమం, లలితా సహస్రనామాలు, అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆయన తెలిపారు.

బహిరంగ ప్రకటన

తేది:19/05/2024

శ్రీ వలాద్రి జయకర్ రెడ్డి తండ్రి: బాల్ రెడ్డి, ఇంటి నెంబర్ కొత్తది 18-17-Pr0014, పాతది 16-193/6, శ్రీనగర్ కాలనీ, ప్రశాంత్ నగర్, సిద్దిపేట, జిల్లా: సిద్దిపేట గారు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC SIDDIPET గారిని వారి యొక్క ఇల్లు కొత్తది నెం. 18-17-Pr0014 (పాతది నెం. 16-193/6) శ్రీనగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్, సిద్దిపేట, జిల్లా: సిద్దిపేటలో గలది, సదరు బ్యాంకు వారికి తనఖా వుంచి అప్పు పొందుటకు సంప్రదించినారు. అట్టి ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింక్ దస్తావేజులు (1) రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెంబర్.833/1996 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, సిద్దిపేట మరియు (2) అంతకు పూర్వపు లింక్ డాక్యుమెంట్ నెం.192/1994 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, సిద్దిపేటకు సంబంధించినవి పోయినవని నిర్ధారించుచూ, దానికి నిరూపణగా పోలీసు శాఖ వారు ఇచ్చిన సర్టిఫికేటును బ్యాంకు వారికి అందజేసినారు.

కావున ఇందు విషయమై ఎవరికైనా ఏలాంటి అభ్యంతరములు ఉన్నచో, సదరు బ్యాంకు వారికి గాని మరియు నాకు గాని ఈ ప్రకటన వెలువడిన (07) దినములలోగా తెలుప గలరు. తదనంతరము వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు.

ఇట్లు: సం/- **ఎస్.మోహన్ కుమార్**
SBI ప్యానల్ అడ్వకేట్
సిరిసిల్ల . Cell: 9440146081